**ప్రజల మాట ప్రగతి బాట**

# తుంగతుర్తి నియోజకవర్గం



తిరుమలగిరిలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రచారానికి హాజరైన జనం

## మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- తిరుమలగిరిలో భారీ రోడ్‌షో, ఎన్నికల ప్రచారం



తిరుమలగిరి రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, నవంబర్ 28 : మరో అవకాశం ఇచ్చి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదిస్తే నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో రోడ్ షో, భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు జననీరాజనం పలికారు. ఈ సందర్భంగా ప్రచార రథం నుంచి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమైఖ్య పాలనలో ప్రజలు జెండాలు మోసి గోసపడ్డారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పేవారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలను ఏనాడు పట్టించుకోనివారు నేడు అభివృద్ధి చేస్తాం ఓటు వేయండని మాయమాటలు చెబుతున్నారు. వారి మాటలు నమ్మితే గోస పడుతామన్నారు. 30 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపించినట్లు చెప్పారు. గ్రామాల్లో చెరువులు, కుంటలకు పూర్వవైభవం తెచ్చినట్లు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదోఒక పథకం వర్తింపజేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. మరోమారు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు.

### కాంగ్రెస్‌ను నమ్మితే గోస తప్పదు..

గత పాలకులు కనీసం గ్రామాలు, ఆవాసాలకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. తాను నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరించిన విషయం అందరికీ తెలుసన్నారు. నియోజక వర్గంలో రూ.6 వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి జరిగినట్లు చెప్పారు. నాడు కాలిబాటలు కూడ సక్రమంగా లేని తండాలకు, ఆవాసాలకు నేడు బీటీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతుందని వెల్లడించారు. అలాగే పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల్లో, ఆవాసాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా రెండు పంటలకు నీరు అందిస్తూ, అన్ని చెరువులు, కుంటలు నింపడం వల్ల నేడు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. బీడు భూములు పచ్చని మగాణిగా మారినట్లు తెలిపారు.

### బీఆర్‌ఎస్‌లో చేరికలు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకులు దామెర ఉపేందర్, అనీల్, నరేశ్, పాష, శ్రీనుతో పాటు పలువురు తిరుమలగిరిలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్ పాల్గొన్నారు.

### మరో అవకాశం ఇస్తే ఊహించని అభివృద్ధి

తనకు మరో అవకాశం ఇస్తే నియోజక వర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కిశోర్ అన్నారు. కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి, కేసీఆర్ ఆరోగ్య రక్ష, అన్నపూర్ణ పథకం, రైతు బంధు పెంపుతో పాటు, ఆసరా, దివ్యాంగ పెన్షన్లు పెంపు జరిగి మరింత సంక్షేమం దరిచేరుతుందని వివరించారు. రాబోవు రోజుల్లో అన్నదాతలకు బీఆర్‌ఎస్ మరింతగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజినీ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ స్రవంతి, ఎంపీపీ స్నేహలత, జడ్పీటీసీ అంజలి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



నాగారంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నాగారం, నవంబర్ 28 : మాదిగల మద్దతు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కే అని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి ప్రవీణ్‌కుమార్‌మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. మందుల సామేల్ కులం పేరుతో మాదిగలను మోసం చేసేందుకు మరోసారి ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ తుంగతుర్తి నియోజక వర్గం మొత్తానికి దళిత బంధు అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కడియం పరమేశ్, పేరాల ప్రవీణ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ చిప్పలపల్లి మల్లేశ్, ఉదయ్, గణేశ్, ఉపేందర్, దేవరకొండ మురళి పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

తిరుమలగిరి, నవంబర్ 28 : ఎన్నికలు ముగిసే వరకు పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర బలగాలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారులకు, పోలింగ్ అధికారికి తెలుపాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం ఉన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జిల్లా పోలీస్ యంత్రాంగం సమావేశానికి ఎస్పీ హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## నాడు రక్తపు మరకలు.. నేడు పసిడి పంటలు

- కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టండి
- అర్వపల్లి ప్రచారంలో జడ్పీ చైర్‌పర్సన్ దీపిక



అర్వపల్లి : ప్రచారంలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దీపిక, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సతీమణి కమల



మోత్కూర్ : దత్తప్పగూడెంలో ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

అర్వపల్లి, నవంబర్ 28 : సమైక్య రాష్ట్ర పాలనలో రక్తపు మరకలతో తడిసిన తుంగతుర్తి నియోజక వర్గం నేల నేడు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాలనలో కాళేశ్వరం జలాలతో పసిడి పంటలతో తులతూగుతున్నదని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగేంధర్‌రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సతీమణి కమలతో కలిసి అర్వపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో తుంగతుర్తి నియోజక వర్గం గొడవలు, కొట్లాటలతో ప్రజలు భయభ్రాంతుల మధ్య జీవించేవారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ అన్ని రంగాల్లో నియోజక వర్గాన్ని ముందుంచుతున్నట్లు చెప్పారు. ఈ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోమారు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఆయా మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీపీ దావుల మనీశా, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మాశ్రీనివాస్, దేవాలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేశ్, ఉప సర్పంచ్ ప్రభాకర్, నాయకులు పెద్దులు, దావుల లింగయ్య, ఉశయ్య, రాజలింగం, ప్రభు, వెంకన్న, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



నాగారంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరమేశ్వర్



నూతనకల్ : మాచనపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సర్పంచ్ అమ్మక్కాభద్రాచలం



తుంగతుర్తిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మండల నాయకుడు రవికుమార్